

## అలాంటి వారిని ఉపేక్షించరు

ఉద్యమ ప్రస్థానంలో, రాజకీయ చదరంగంలో కేసీఆర్ వెంట నడిచిన వారు ఎందరో! కొందరు దూరమయ్యేవారు! కొందరు కొత్తగా వచ్చేవారు!! ఎందరు దూరమైనా చలించని వ్యక్తిత్వం ఆయనది. ప్రజా సమస్యలు, ప్రయోజనాల విషయంలో విభేదించి ఎవరూ ఆయనకు దూరం కాలేదన్నది సత్యం. వ్యక్తిగత ఆసక్తులతో ఆయన్ను కలిస్తే పెద్దగా పట్టించుకోరు కేసీఆర్. పార్టీ కోసం, ఉద్యమం కోసం త్యాగాలకు ఎప్పుడూ సిద్ధంగా ఉండేవారాయన. విజయశాంతిని గెలిపించడానికి బంగారంలాంటి మెదక్ సీటును ఆమెకు ఇచ్చారు. తెలంగాణ వాదం అన్ని ప్రాంతాలకూ విస్తరించాలని మెదక్‌ను కాదనుకొని ఎంపీగా మహబూబ్‌నగర్ నుంచి పోటీ చేశారు. ఎన్నికల్లో సీట్లు ఇవ్వలేదన్న అక్కసుతో, వ్యక్తిగత అవసరాలను నెరవేర్చలేదన్న ఆవేశంలో పార్టీని వీడి పోయేవారి గురించి ఎప్పుడూ ఆలోచించలేదు. అన్నిటినీ మించి నమ్మక ద్రోహం చేసే వారిని ఉపేక్షించరు. పార్టీకి నష్టం వాటిల్లుతుందని తెలిసినా లెక్కచేయరు.

***

తెలంగాణ ఆకాంక్ష నివురుగప్పిన ప్రతిసారీ.. దాన్ని జ్వలింపజేసేలా కేసీఆర్ వజ్ర సదృశమైన నిర్ణయాలు తీసుకున్నారు. 'ఉద్యమానికి హైప్ తీసుకురావాలి. తెలంగాణ వాదం ఎంతలా వేళ్లూనుకుందో చాటి చెప్పాలి' ఇదే ఆయన తపన. అందుకు తగ్గట్టుగా కచ్చితమైన హేతువును అందుకోవడంలో కేసీఆర్ చూపిన రాజకీయ చతురతకు తిరుగులేదు. కరీంనగర్ ఉప ఎన్నిక అలాంటి ఎత్తుగడే! 'తెలంగాణవాదం ఎక్కడుంది?' అని అప్పటి కాంగ్రెస్ మంత్రి ఎమ్మెస్ మాట జారుడుతనానికి ఓటుతోనే దీటుగా జవాబు ఇవ్వాలనుకున్నారు. ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తూ.. 'కరీంనగర్ ఉప ఎన్నిక వెయ్యి అలజడుల పెట్టు. ఇది మనకు అంతిమ యుద్ధం. చావో, రేవో తేల్చుకుందాం. మిమ్మల్ని లాఠీ దెబ్బలు తినమనడం లేదు. వ్యవసాయం, ఉద్యోగం, వ్యాపారాలు పాడు చేసుకోమని చెప్తలేను. చేయాల్సిందల్లా.. ఓటుతో బదులిద్దాం. తెలంగాణవాదాన్ని బలంగా వినిపిద్దాం' అని పిలుపునిచ్చారు. ఆ రోజు కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో జెడ్పీటీసీలు లేరు, ఎంపీపీలు లేరు. కేసీఆర్‌ను ఓడించడానికి అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి చెయ్యని కుతంత్రం లేదు. తాబేదార్లయిన తెలంగాణ కాంగ్రెస్ నాయకులు వేసిన ఎత్తులు అన్నీ ఇన్నీ కావు. వీటన్నిటి మధ్య కరీంనగర్ ఉప ఎన్నిక జరిగింది. యావత్ తెలంగాణం రొమ్ము విరుచుకొని, జబ్బ చరుచుకునేలా ఫలితం వచ్చింది. మళ్లీ ఉత్సాహం. కానీ, క్రెడిట్ గేమ్‌లో ఈ గెలుపును కేసీఆర్‌కు కట్టబెట్టడం ఇష్టం లేని కొందరు పత్రికాధిపతులు తెలంగాణపై అసంకల్పిత ప్రేమను ఒలకబోశారు. కేసీఆర్ గెలుపును తెలంగాణ విజయంగా చెప్పడానికి మనసొప్పక పోగా, 'ఎన్నికలకు దీనికి ముడిపెట్టడం ఏమిటి? ఓడిపోయి ఉంటే తెలంగాణవాదం ఓటమి పాలయ్యేది కదా!' అని సుదీర్ఘ వ్యాసాలు రాసి కుటిల కుతి తీర్చుకున్నారు. ఉద్యమాన్ని తాకట్టు పెట్టారంటూ విశ్వసనీయతను ప్రశ్నించే ప్రయత్నాలు చేశారు. రెండోసారి ఉప ఎన్నికల సందర్భంలో... టీఆర్ఎస్ దెబ్బ తినడంతో మరోసారి కేసీఆర్ పని అయిపోయిందని అత్యుత్సాహం ప్రదర్శించారు. కానీ, ఆశించిన ఫలితాలు రానంత మాత్రాన కుదేలయ్యే రకం కాదు కేసీఆర్. ఆయన నిస్తేజంలో కూరుకుపోయే వ్యక్తే అయితే.. తెలంగాణ ఉద్యమం అంత సుదీర్ఘకాలం జరిగి ఉండేది కాదు. 'ఒక సమయం వస్తది. తెలంగాణ అంతా ఒకవైపు నిలబడతది. అప్పుడు బరిగీసి రాష్ట్రం సాధించుకుంటం' అని ఆయన ఎప్పుడూ నమ్మేవారు.

***

నీరవ నిశ్శబ్దం నుంచి పొలికేక పుట్టించే శక్తి కేసీఆర్‌కు ఉంది. అదును చూసి పదునైన అస్త్రం సంధించడంలో సవ్యసాచి. తాత్కాలిక ప్రయోజనం ఆశించి కాకుండా.. ఉన్నతమైన, ఉదాత్తమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుంటారు. ఆయన ఎత్తులు, పొత్తులతో ప్రత్యేక వాదాన్ని సహించని పార్టీలతో



> 'నా పని కనిపిస్తుంది.. నేను కనిపించకపోతేనేం'
>
> 'ఒక సమయం వస్తది. తెలంగాణ అంతా ఒకవైపు నిలబడతది. అప్పుడు బరిగీసి లక్ష్యాన్ని సాధించుకుంటం'